## పోలింగ్ కేంద్రాల వద్ద 'క్యూ' లైన్ సమాచారానికి..

# 'పోల్ క్యూరూట్' యాప్ వాడండి

### ప్రశాంతంగా ఓటు వేయండి

సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ) : పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసే క్యూ లైన్ వివరాలు తెలుసుకునేందుకు జిల్లా ఎన్నికల విభాగం మొట్టమొదటి సారిగా వినూత్న చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే ఉద్దేశంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న క్యూ లైన్ వివరాలు తెలుసుకునేందుకు 'పోల్ క్యూ రూట్' యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా పోలింగ్ స్టేషన్ల వద్ద నిలబడి ఉన్న ఓటర్ల క్యూ లైన్ వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు.

☞ ముందుగా జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత.. పోల్ క్యూ రూట్‌ను సెలెక్ట్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత నియోజకవర్గం పేరు, పోలింగ్ స్టేషన్ పేరు నమోదు చేసిన తర్వాత పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉన్నదో నావియేషన్ (గూగుల్ మ్యాప్) చూపిస్తుందని పేర్కొన్నారు. ఎంతమంది క్యూలో వేచి ఉన్నారో అన్న సమాచారం తెలుస్తుందని చెప్పారు. ఇందులో వెయింటింగ్ టైం కూడా తెలుసుకోవచ్చునని వివరించారు. ఈ యాప్‌లో నియోజకవర్గం పేరు, పోలింగ్ స్టేషన్ పేరు నమోదు చేసి.. మీరు ఓటు చేసే పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న క్యూలైన్ వివరాలు తెలుసుకోవచ్చని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున ఓటు వేయాలన్నారు.

### పోలింగ్ రోజు ఏం చేస్తారంటే..

రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎంలను పోలింగ్ తేదీ (గురువారం)న ప్రిసైడింగ్ అధికారి (పీవో) సారథ్యలో వాటిని పోలింగ్ కేంద్రాలలో అమర్చుతారు. ఉదయం 5. 30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6.30 లోగా మాక్ పోలింగ్ ప్రక్రియను ముగిస్తారు. ఏజెంట్లు అన్ని పరిశీలించి.. అభ్యంతరాలు లేవని చెప్పిన తర్వాతే ఈవీఎంను ఓటింగ్‌కు ఉపయోగిస్తారు. ఏవైనా సందేహాలు ఉంటే రిజర్వ్ చేసిన ఈవీఎంను పరీక్షించి.. ఏజెంట్లు ఒప్పుకుంటే వాటిని ఓటింగ్‌కు వాడతారు. మాక్ పోలింగ్‌లో ప్రతి ఈవీఎంలో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేస్తారు. వాటిని ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓటు వేయాల్సి ఉంటుంది. అన్నీ సరిగా ఉంటేనే.. ఆ ఈవీఎంను వారి సమక్షంలోనే జీరో చేసి ఓటర్లు ఓటు వేసేందుకు ఉపయోగిస్తారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది.

### మొరాయించిన వాటిని తొలగించడం..

ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలు కీలకమైనవి. దీంతో వాటి పనితీరు సరిగా ఉంటేనే ఓటర్లు తమ ఓటును సక్రమంగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. మాక్ పోలింగ్ సమయంలోనే ఈవీఎంల పనితీరును పరిశీలిస్తారు. ఓటరు ఓటేయాలంటే కంట్రోల్ యూనిట్ (సీయూ), వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్..ఈ మూడు సరిగా పనిచేయాల్సి ఉంటుంది. సీయూ, బీయూ పనిచేయకపోతే సీయూ, బీయూతో పాటు వీవీ ప్యాట్‌ను మార్చాల్సి ఉంటుంది. కొత్త వాటితో మళ్లీ మాక్ పోలింగ్ నిర్వహించాలి. సీయూ బ్యాటరీ పనిచేయకపోతే బ్యాటరీ మాత్రమే అమర్చుతారు. అప్పుడు మాక్ పోలింగ్ అవసరం ఉండదు.

### పోలింగ్ గడువు..

పోలింగ్ గడువు ముగుస్తుందనే అంశాన్ని 15 నిమిషాల ముందే ప్రిసైడింగ్ అధికారి ప్రకటించాల్సి ఉంటుంది. సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరూ ఓటు వేయడానికి అర్హులు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సీయూలో 'క్లోజ్' బటన్ నొక్కుతారు. అనంతరం సీయూలో మొత్తం ఓట్లు, 17ఏలో మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు పరిశీలించుకుంటారు. ఆ తర్వాత సీయూ స్విచ్ ఆఫ్




చేసి వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్లను డిస్ కనెక్ట్ చేస్తారు. వీవీ ప్యాట్ నుంచి బ్యాటరీ తీసివేస్తారు. పోలింగ్ మొదలవగానే సీయూ, వీవీ ప్యాట్‌లకు సీల్ వేస్తారు. చివరిలో క్లోజ్ చేస్తారు. అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఏజెంట్లతో సంతకం తీసుకుంటారు.

### సిటిజన్ యాప్‌లో పోలింగ్ శాతం

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకోకసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు వెల్లడిస్తారు. అయితే, 17-ఏ రిజిస్టర్‌లో నమోదు చేసిన ఓట్లు, ఓటరు స్లిప్పులు , సీయూలో మొత్తం ఓట్లను సరి చూసుకుంటారు. అప్పుడే పోలింగ్ శాతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. ఉదయం 9, 11, ఒంటిగంట, 3 గంటలు, 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తారు. పోలింగ్ కేంద్రంలో నమోదైన పోలింగ్ శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపిస్తారు. సెక్టార్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు ఎప్పటికప్పుడు ఆన్




లైన్‌లో నమోదు చేస్తారు.

### లెక్కింపు కేంద్రానికి..

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి.. క్లోజ్ చేసిన సీయూ, బీయూ, వీవీ ప్యాట్లను ఆయా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు చేరస్తారు. మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు.

### ప్రత్యేక గుర్తులతో మార్కింగ్..

ఓటర్లలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు.. ఇలా మూడు రకాలు ఉన్నారు. ఓటు వేసేందుకు వచ్చినప్పుడు అదనపు ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేక గుర్తులతో మార్కింగ్ చేస్తారు. ఓటు వేయడానికి పురుషులు వస్తే ఓటరు జాబితాలో పేరుంటే వారికి అడ్డుగీత గీసి మార్కింగ్ చేస్తారు. మహిళలు వస్తే వారికి అడ్డుగీతతో పాటు వారి ఓటరు క్రమ సంఖ్యకు వృత్తం చుడతారు. ఇక ట్రాన్స్‌జెండర్లు వస్తే అడ్డుగీతతో పాటు వారి క్రమ సంఖ్యకు స్టార్ గుర్తు వేస్తారు. ఈ విధానం వల్ల ఎవరెవరూ ఎంతమంది ఓటేశారో సులువుగా తెలుసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

---

## డీఆర్సీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అనుదీప్

అంబర్‌పేట, నవంబర్ 29: అంబర్‌పేట డీఆర్సీ సెంటర్‌ను బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. నియోజకవర్గం ఆర్వో అపర్ణ, ఏఆర్వో మారుతి దివాకర్, భిక్షపతితో కలిసి కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు సూచించారు.



అంబర్‌పేట డీఆర్సీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అనుదీప్

## తప్పుడు ప్రకటనలు మానుకోవాలి

- తలసానికే మా మద్దతు
- నాయీబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ నాయీ

బేగంపేట, నవంబర్ 29: సనత్‌నగర్ నియోజకవర్గంలో నాయీ బ్రాహ్మణుల సంపూర్ణ మద్దతు తలసాని శ్రీనివాస్ యాదవుకేనని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ నాయీ తెలిపారు. నియోజకవర్గానికి సంబంధం లేని కొంతమంది తమ మద్దతు బీజేపీకి ఇస్తున్నట్టు కొన్ని పత్రికల్లో ప్రకటనలిస్తూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌నాయీ, ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, నగర ఉపాధ్యక్షుడు మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ వృత్తికి చేయూతను అందించడంలో భాగంగా ప్రతి సెలూన్‌కు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న పార్టీని ఆదరిస్తామన్నారు. అలాగే ఏ అవసరం వచ్చినా అండగా నిలిచే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు తమ సంపూర్ణ మద్దతును ఈ నెల 21న నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రకటించామని తెలిపారు. తప్పుడు ప్రచారం చేస్తూ.. తమ వారిని అయోమయానికి గురి చేసేలా ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇకనైనా వారు వైఖరి మార్చుకోక పోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**డీఆర్‌సీ సెంటర్లను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్**



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ) :పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి హైదరాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్‌లను పరిశీలించారు. ముందుగా జిల్లా ఎన్నికల అధికారి అరోరా లీగల్ సైన్స్ అకాడమీలో ఏర్పాటు చేసిన బహదూర్‌పుర నియోజకవర్గం డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కోఠి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన గోషామహల్ నియోజకవర్గం డీఆర్‌సీ సెంటర్, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల డీఆర్‌సీ సెంటర్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయంలో ఏర్పాటు చేసిన యాకుత్‌పుర డీఆర్‌సీ సెంటర్, కమలా నెహ్రూ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన చార్మినార్ నియోజకవర్గం డీఆర్‌సీ సెంటర్‌లను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీ హిల్స్ నియోజకవర్గాల డీఆర్‌సీ సెంటర్‌ను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు.

## ఓటేద్దాం పదండి..!

- సొంతూళ్లకు బయలుదేరుతున్న ప్రయాణికులు
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

సిటీబ్యూరో, నవంబర్ 29 ( నమస్తే తెలంగాణ ): ఓటు వేసేందుకు ఓటర్లు సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. గురువారం పోలింగ్ ఉండటంతో నగరంలో నివసిస్తున్న వివిధ ప్రాంతాల ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమ ఊళ్లకు పయనమయ్యారు. దీంతో బుధవారం నగరంలోని ప్రయాణ ప్రాంగణాలు సందడిగా మారాయి. ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఓటింగ్ నేపథ్యంలో అధిక సంఖ్యలో జనం ప్రయాణాలు పెట్టుకోవడంతో ఆర్టీసీ అదనంగా బస్సులను ఏర్పాటు చేసింది. ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

